క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు

కంబాలచెరువు: స్థానిక రాజేంద్రనగర్ గజ్జాలమ్మ గుడి వీధిలో మంగళవారం సీజనల్ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పరిశీలించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. శిబిరంలో రోగులను డాక్టర్ రాజీవ్, కంబాలపేట యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మల్లాది కృష్ణ అనూహ్యలు పరీక్షించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ డీడీ భవానీ, ఏఎన్‌ఎంలు శేషకుమారి, సంధ్య, ఆశా వలంటీర్లు హవీల కుమారి, మహారాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు

కడియం: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో కడియపులంక సచివాలయం-2, కడియం సచివాలయం-2 పరిధిలో ప్రభుత్వాసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. కడియపులంకలో 47 మందిని పరీక్షించగా ఏడుగురు, కడియంలో 62 మందిని పరీక్షించగా ఐదుగురు జ్వరంతో బాధపడుతున్నట్లుగా గుర్తించారు. వారికి డెంగ్యూ, మలేరియా పరీక్షలను చేసి మందులు అందజేశారు. ఆయా వైద్య శిబిరాల్లో డాక్టర్ ఎస్.నాగసాయిమౌర్య, డాక్టర్ జి.స్వరూప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ, నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 17 నుంచి 21 వరకూ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-11, అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, యోగా, చెస్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామిని సంప్రదించాలని కోరారు.

నేడు బీజేపీ సదస్యత అభియాన్ కార్యక్రమం

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ సదస్యత అభియాన్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, శ్రేణులు జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు మంగళవారం పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని క్వారీ సెంటర్‌లో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో సామూహిక సదస్యత(సభ్యత నమోదు) కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారన్నారు.

విద్యార్థినుల భద్రతపై అవగాహన సదస్సు

కంబాలచెరువు: నేటి సమాజంలో విద్యార్థినులు, మహిళలు భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల గుడ్లవల్లేరు హాస్టల్‌లో వెబ్ కెమెరాల ఘటన నేపథ్యంలో విద్యార్థినులు తమ స్వీయ రక్షణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్‌కు చెందిన 200 మంది వలంటీర్లు అవగాహన కల్పించారు. కళాశాల, హాస్టల్, మరెక్కడైనా సరే కెమెరాల కారణంగా ఎదురయ్యే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి, ఎస్ఐ పి.నాగరత్నం, ఎస్ఐ పి.నారాయణమ్మ, ఎస్ఐ పీడీ లక్ష్మీప్రసన్న, ప్రిన్సిపాల్ ఎస్‌కేఎస్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ: తమిళనాడులోని తిరుచ్చి కొంగునాడు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ అండ్ టెక్నలాజికల్‌లో సౌత్ జోన్ స్థాయిలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ సౌత్ జోన్ యోగా పోటీల్లో రాష్ట్రం తరఫున ఐదుగురు సభ్యుల బృందం మూడో స్థానంలో సాధించి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నట్టు జట్టు కోఆర్డినేటర్ కేఎస్‌వీ శ్రీధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో తమిళనాడులో జరిగిన పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన కె.హేమ నిర్మలారెడ్డి, గుంటూరుకు చెందిన నాగాంజలి, పశ్చిమగోదావరికి చెందిన కార్తిక, కాకినాడకు చెందిన లక్ష్మి వెంకట సాయి, అనకాపల్లికి చెందిన ఇందు పాల్గొని ప్రతిభ చాటారన్నారు. ఈ బృందం అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకూ న్యూఢిల్లీలో జరిగే అస్మిత ఖేలో ఇండియా జాతీయ ఉమెన్స్ లీగ్ యోగా పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన హేమ నిర్మలారెడ్డిని కలెక్టర్ పి.ప్రశాంతి అభినందించారు.

ఈ రోడ్డులో ప్రయాణం.. సర్కస్‌తో సమానం



వేమగిరి వద్ద ప్రమాదకరంగా ఉన్న గోతుల్లో బోల్తాపడిన ఆటో(ఫైల్)

- అభివృద్ధికి నోచుకోని వేమగిరి-కాకినాడ కెనాల్ రోడ్డు
- రోడ్డు పొడవునా సర్వం గోతులమయం
- వరుస ప్రమాదాలతో హడలిపోతున్న వాహనదారులు

కడియం: వేమగిరి జాతీయ రహదారి నుంచి కాకినాడ వైపు వెళ్లే కెనాల్ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా తయారైంది. రోడ్డు పొడవునా సర్వం గోతులమయంగా మారిపోవడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. కొన్నిచోట్ల రెండడుగుల లోతు వరకూ ఉన్న గోతులు పడిపోవడంతో ఒక్కోసారి వాహనాలు సైతం తిరగబడిపోతున్నాయి. ప్రధానంగా వర్షాలు వచ్చినపుడు ఎక్కడెక్కడ ఎంతెంత లోతు గోతులున్నాయో తెలియక అనేకమంది వాహనదారులు ప్రమాదాల బారినపడి గాయాల పాలవుతున్నారు.

ప్రయాణమంటేనే భయం.. భయం..

మండల కేంద్రమైన కడియం, వీరవరం, దుళ్ల, జేగురుపాడు, కడియపుసావరం, దామిరెడ్డిపల్లి, మాధవరాయుడుపాలెం తదితర గ్రామాలకు వెళ్లే వారితో పాటు కాకినాడ వైపునకు ప్రయాణించే వేలాది వాహనాలు కెనాల్ రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా వేమగిరి పంచాయతీ కార్యాలయం దాటిన తరువాత నుంచి జీఎంఆర్ వరకూ, ద్వారపూడి నుంచి అనపర్తి వరకూ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారిపోయింది. ఈ ఏడాదిలోనే ఓ ద్విచక్ర వాహనదారుడు గోతుల్లో పడి అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలపాలై మరణించాడు. వాహనాలు అదుపుతప్పి తిరగబడుతున్న ఘటనలైతే కోకొల్లలు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించాలంటేనే వాహనదారులు భయపడిపోతున్నారు. ఈ కారణంగానే రాజమహేంద్రవరం నుంచి ద్వారపూడి, అనపర్తి పరిసర ప్రాంతాలకు వెళ్లేవారైతే కడియం-వేమగిరి రోడ్డు మీదుగా కాకుండా కొండగుంటూరు, కేశవరం మీదుగా ప్రయాణిస్తున్నారు.

పట్టాలెక్కని ప్రతిపాదనలు

ప్రమాదాలు జరిగినపుడు ఈ రోడ్డులో తాత్కాలిక మరమ్మతులు చేయడం తప్పితే శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడడం లేదు. వేమగిరి నుంచి కాకినాడ వరకూ కెనాల్ రోడ్డు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడమే తప్ప అవి పట్టాలెక్కడం లేదు. రోడ్డు విస్తరణకు ఏళ్ల తరబడి ప్రతిపాదనలున్నా అవీ ఆచరణకు నోచుకోలేదు. రోడ్డు విస్తరణ కోసం గతంలో భూసేకరణ కూడా పూర్తి చేశారు. అయినా విస్తరణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. సేకరణ పూర్తయిన చోట్ల సైతం మళ్లీ ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. అయినా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి కెనాల్ రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణమంటే భయమేస్తోంది

వేమగిరి నుంచి కడియం వరకూ కెనాల్ రోడ్డుపై ప్రయాణమంటే భయమేస్తోంది. ఈ రోడ్డులో పెద్ద పెద్ద గోతులుండడంతో ఎంత జాగ్రత్తగా వెళదామన్నా ఏదో చోట ఇబ్బందులు తప్పడం లేదు. అందుకే వరుస ప్రమాదాలతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. వీలైనంత త్వరగా కెనాల్ రోడ్డును అభివృద్ధి చేయాలి.

– కేవీఎస్ మోహనరావు, కేశవరం

ఏమరుపాటుగా ఉంటే అంతే

కెనాల్ రోడ్డు మీద ప్రయాణించేటప్పుడు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలు గాల్లో కలిసిపోవడం ఖాయం. రోడ్డుపై రెండేసి అడుగుల లోతు వరకూ గోతులు పడిపోయాయి. వర్షాలొచ్చినపుడు గోతుల లోతు అంచనా వేయలేక వాహనాలు తిరగబడిపోతున్నాయి. లోడుతో వచ్చేవి, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే.

– కె.వెంకటేశ్వరరావు, కడియం

ఆఫీస్ సబార్డినేట్‌కు గాయాలు



ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తలుపులమ్మ

రాజమహేంద్రవరం రూరల్: పింఛన్ల పంపిణీకి వెళుతూ ఒక ప్రభుత్వ ఉద్యోగిని గాయాలపాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ధవళేశ్వరం పంచాయతీ ఉద్యోగవర్గాలు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 31న ధవళేశ్వరం గ్రామ పంచాయతీ ఆఫీస్ సబార్డినేట్ సోమాదుల తలుపులమ్మకు గ్రామ సచివాలయం-5 పరిధిలో పింఛన్లు పంపిణీ చేసే బాధ్యతను అప్పగించారు. ఆ రోజు తెల్లవారుజామున తలుపులమ్మ తన వాహనంపై పింఛన్లు ఇచ్చేందుకు వర్షంలో బయలుదేరింది. క్వారీ కెనాల్ రోడ్డులో ఆమె వాహనం గోతిలో పడడంతో అదుపుతప్పి కింద పడిపోయింది. దీంతో తలుపులమ్మ ఎడమచేయి విరిగిపోయింది. దీంతో ఆమెను రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చేతికి శస్త్రచికిత్స చేశారు. పింఛన్ల పంపిణీ విషయంలో ఉన్నతాధికారుల ఒత్తిళ్ల కారణంగానే దిగువ స్థాయి ఉద్యోగులు ఆందోళనకు గురై ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఉద్యోగస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి కంటిచూపు



సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సీతానగరం: నేత్రదానం చాలా గొప్పదని, మనిషి మరణించాక ఇద్దరికి కంటిచూపు కల్పించవచ్చని పీహెచ్‌సీ వైద్యుడు ఏవీకే చైతన్య తెలిపారు. మంగళవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ మరణించినా, దాత కళ్లు జీవించి ఉంటాయని, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలన్నారు. కార్యక్రమంలో పీఎంఓపి రజాఖాన్, ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, పీహెచ్‌ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లాల తరలింపు



ఆహార పొట్లాలు తీసుకెళుతున్న వాహనాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ పోసిబాబు



ఆహారపొట్లాలు పంపిస్తున్న నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, సభ్యులు



ఆహార ప్యాకెట్లను పంపిస్తున్న తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ సరోజినీదేవి



ఆహార పొట్లాలు తీసుకెళుతున్న వాహనం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ జేఎస్ లక్ష్మీరమ్య

కడియం: విజయవాడ పరిసరాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పంపిణీ చేసేందుకు కడియం మండలం నుంచి పలువురు ఆహార పొట్లాలను తయారు చేసి పంపించారు. కడియం తహసీల్దార్ కార్యాలయం తరఫున 2,500 పొట్లాలను పంపించారు. వాహనానికి తహసీల్దార్ పోసిబాబు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వరద బాధితుల సహాయార్థం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ నేతృత్వంలో లెమెన్ రైస్‌ను తయారు చేయించి వాహనంలో విజయవాడ పంపించారు. కార్యక్రమంలో వెలుగుబంటి రఘురామ్, పెనుమాక కొండబాబు, గాద నాగేశ్వరరావు, గట్టా కృష్ణ, రావిపాటి రామకృష్ణ, తాడాల బాలమురళీ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడలోని వరద బాధితులకు రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంగళవారం 10 వేల మందికి వెజ్ బిర్యానీ, కుర్మా, వాటర్ ప్యాకెట్లు పంపించామని డైరెక్టర్ నున్న సరోజినీదేవి తెలిపారు. తిరుమల విద్యాసంస్థల భీమవరం బ్రాంచ్ నుంచి మరో 4,000 మందికి ఆహార పొట్లాలు, వాటర్ ప్యాకెట్లు పంపామన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, నున్న సురేష్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం రూరల్ మండలం నుంచి 3,100 ఆహార పొట్లాలను విజయవాడకు పంపించామని ఇన్‌చార్జి తహసీల్దార్ జేఎస్ లక్ష్మీరమ్య తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం విజయవాడకు ఆహారాన్ని తీసుకెళుతున్న వాహనాన్ని ఆమె జెండా ఊపి పంపించారు.

ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పిస్తాం



మహిళల శిక్షణను పరిశీలిస్తున్న పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, చిత్రంలో సీనియర్ సైంటిస్ట్ డీవీఎస్ రాజు తదితరులు

కడియం: మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మిగులు పువ్వుల నుంచి అగర్‌బత్తీల తయారీ శిక్షణను మంగళవారం ఆయన డీఏఫ్ఆర్‌సీ సీనియర్ శాస్త్రవేత్త డీవీఎస్ రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మూర్తి మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్(ఆర్‌ఎస్‌ఈటీఐ) సంయుక్తంగా శిక్షణ ఇస్తున్నాయన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్లోరీకల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.భారతిక శ్యప్, యువన్ వెండర్ రవీందర్‌పరాస్‌లు ఆన్‌లైన్‌లో మహిళలకు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ జరుగుతున్న తీరును మహిళలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం బి.అప్పలకొండ, లక్ష్మీపతి, బ్యాంకు ప్రతినిధులు టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మందుల పంపిణీ



వరద బాధితులకు మందులు పంపిస్తున్న డ్రగ్స్ ఏడీ నాగమణి తదితరులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): విజయవాడ వరదల్లో చిక్కుకుని అస్వస్థతకు గురైన బాధితులకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ బాసటగా నిలిచింది. ఔషధ నియంత్రణ శాఖ ఏడీ నాగమణి ఆధ్వర్యంలో ఉమ్మడి గోదావరి జిల్లాలోని మందుల వ్యాపారులందరూ ఒకటిగా కలిసి విజయవాడలోని వరద బాధితులకు రూ.13 లక్షల విలువైన మందులను మంగళవారం పంపిణీ చేశారు. సుమారు 5,000కు పైగా మెడిసిన్ కిట్లను తయారు చేసి విజయవాడ వాసులకు అందించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ ఏడీ నాగమణి మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులు మందులు దొరక్క ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో మందులు అందించామన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లా మందుల వ్యాపారులందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, అసోసియేషన్ ప్రెసిడెంట్ పిల్లా బాల, సెక్రటరీ యక్కల వీరనాగేశ్వరరావు, పెండెం రామ్‌జీ, మల్లిఖార్జునరావు, మోహన్, ఎంవీవై సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రంగంపేట: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై తోట కృష్ణసాయి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో తనిఖీలు నిర్వహించగా గ్రామానికి చెందిన కుడిపూడి సత్తిబాబు అక్రమంగా సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



సంపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు



సీతానగరం పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న మండల ఆశా వర్కర్లు

పెదపూడి: ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ మండల నాయకురాలు ఎం.రాజేశ్వరి అన్నారు. మండలంలో పెద్దాడ, సంపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో ఆశ వర్కర్లు భోజన విరామ సమయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి, ఆశా వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ గత ఫిబ్రవరి 9న సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆందోళన చేశారు. గత ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపిన డిమాండ్లకు సంబంధించి మినిట్స్ కాపీలు ఇచ్చారన్నారు. వాటికి జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రసూతి ప్రభుత్వ సెలవులు ఇవ్వాలన్నారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. రికార్డులు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. లైంగిక్ వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు సురేఖ, ప్రత్యూష, శిరీషకు ఆశా వర్కర్లు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ ప్రతినిధులు వల్లూరి ఉమావతి, వీరలక్ష్మి, జి.ఈశ్వరమ్మ, రాయుడు నాగమణి, సత్యవతి, సుశీల, రోజా మనీ, తెల్లమ్మ, శ్రీదేవి, బుజ్జి, మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని ఆశావర్కర్లు తమ న్యాయపరమైన డిమాండ్లు అమలు చేయాలని కోరుతూ సీతానగరం పీహెచ్‌సీ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మండలంలోని ఆశావర్కర్లు తరలివచ్చి నిరసన కార్యక్రమం అనంతరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్యకు వినతి పత్రం అందించారు. ఆశావర్కర్లు మండల యూనియన్ అధ్యక్షురాలు ఎం.కుమారి మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.60 వేలు, గ్రూపు ఇన్సూరెన్స్, నాణ్యమైన సెల్ ఫోన్లు, మెటర్నిటీ లీవ్స్, 62 ఏళ్లు కాలపరిమితి, మట్టి ఖర్చులు రూ.20 వేలు వంటి పలు న్యాయపరమైన డిమాండ్లను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు సీహెచ్ విజయ, బీవీఎల్ కుమారి, డి.విజయ, ఆశాలత, జ్యోతి, సంధ్య, లలిత, సాయి అనంతలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తగా ఉండాలి



రంగంపేటలోని సమావేశంలో మాట్లాడుతున్న వేణుశ్రీలక్ష్మి

రంగంపేట: డెలివరీ టైమ్ దగ్గర పడే గర్భిణులు ప్రస్తుత సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి సూచించారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద మంగళవారం సాయంత్రం ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురుస్తున్న కారణంగా గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి ఫీవర్, డయేరియా సర్వేలు చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామ సచివాలయాల వద్ద ప్రతి రోజూ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్ని పిల్లలకు ఎలాంటి అస్వస్థత కలగకుండా చూడాలన్నారు. ఈ సమయంలో గర్భిణులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	సరిపోదా శనివారం
సూర్యమినీ	:	డిమోంట్‌కాలనీ-2
సూర్యప్యాలెస్	:	సరిపోదా శనివారం
స్వామి	:	సరిపోదా శనివారం
అశోక	:	ఆయ్
శివజ్యోతి	:	మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
అనుశ్రీ	:	కమిటీ కుర్రోళ్లు
రాజా	:	సరిపోదా శనివారం
రంభ	:	గబ్బర్‌సింగ్
ఊర్వశి	:	తంగలాన్
మేనక	:	రాయన్
కుమారి	:	అహో విక్రమార్క
అప్సర నామవరం	:	సరిపోదా శనివారం
వీఎస్ మహల్ ధవళేశ్వరం	:	సరిపోదా శనివారం
మురళీకృష్ణ కడియం	:	సరిపోదా శనివారం
వెంకటసూర్య	:	సరిపోదా శనివారం

శాంతి భద్రతలకు విఘాతం కలగకూడదు



సీతానగరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

సీతానగరం: శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ విధులు సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ సూచించారు. మంగళవారం సీతానగరం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌కు విచ్చేసిన ఎస్పీ నరసింహ కిషోర్‌కు కోరుకొండ సీఐ వై.సత్య కిషోర్, ఎస్సై డి.రామ్ కుమార్‌లు ఘన స్వాగతం పలికారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల పరిసరాలను, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్‌లో గల వివిధ రికార్డులను పరిశీలించి, నమోదైన కేసులపై ఆరా తీశారు. కేసులకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణాను నియంత్రించాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌ని పెంచాలని తెలిపారు. అనంతరం సిబ్బందితో ముఖాముఖి మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో ఇన్‌చార్జ్ నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, ఎస్‌బి ఎస్సై ఎ.శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా బాలిక విద్యా కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి

పెదపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపర్చాలని జిల్లా విద్యా కోఆర్డినేటర్ పి.ఉమామహేశ్వరి ఉపాధ్యాయులకు సూచించారు. జి.మామిడాడ జెడ్పీ బాలకల ఉన్నత పాఠశాలలో ఆమె మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. అనంతరం డొక్కా సీతమ్మ పీఎం పోషణ మధ్యాహ్న భోజనం పథకం పరిశీలించారు. సుమారు 95 శాతం మంది విద్యార్థులు భోజనం చేయడం మంచిదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తి వెంకటరెడ్డి(ఎస్‌వీఆర్), ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.